సాయంకాలపు చల్లటి గాలులు పగలంతా కాసిన ఎండ ప్రతాపాన్ని పోగొడుతున్నాయి. శరీరాలకు, మనసులకు ప్రశాంతత కలిగిస్తున్నాయి.

ఉడతలు రెండు పిట్టగోడ మీద మామిడిచెట్టు దగ్గర నుండి జామచెట్టు వరకు పరుగులు పెడుతున్నాయి. అవి చూడటానికి చాలా ముచ్చట గొలుపుతున్నాయి.


మొక్కలన్నింటికి నీళ్ళు పోయడం వలన తాజాగా కన్పిస్తున్నాయి. వీచేగాలికి వయ్యారంగా కొమ్మలు, ఆకులు, పూలు కదులుతున్నాయి.

అంజలి సన్నజాజి మొగ్గలని జాగ్రత్తగా కోస్తోంది. సన్నజాజి సుకుమారమైన, సువాసన భరితమైన పూవు. ఏ మాత్రం కఠినత్వానికి తలవంచలేదు.

జామచెట్టు దగ్గర నున్న సిమెంటు బెంచీ మీద రామారావు గారు కూర్చుని చదివినదే అయినా పేపర్‌ను మరొకసారి తిరగేస్తున్నారు.

అఖిల్, నిఖిల్ కాస్త దూరంలో క్రికెట్ ఆడుకొంటున్నారు.

''అమ్మా! అంజలీ!'' రామారావు గారు పిలిచారు.



# చిరుదీపం

## శ్రీమతి తనికెళ్ళ కళ్యాణి

''ఇంక కాసిని మొగ్గలే ఉన్నాయి నాన్నగారు! వచ్చేస్తున్నాను'' అంజలి ఆయన పిలుపు కర్థం తెలిసిన దాని లాగ బదులు చెప్పింది.

ఆయన మనవల వైపు చూశారు. లోకంలోని దీక్ష అంతా వాళ్ళదే అన్నట్టు క్రికెట్ ఆడుతున్నారు.

ఆయన నవ్వుకొన్నారు. చిన్నప్పుడు ''అవినాష్'' కూడా ఇంతేకదా! సాయంత్రం వేళలో గానీ, ఆదివారం ఉదయం గానీ ఏ పనీ చెప్పడానికి లేదు. క్రికెట్ ఆటలో మునిగేవాడు.

''మిగిలిన టైమ్ మీది. ఈ టైమ్ నాది'' అంటూ పేచీ పెట్టేవాడు. ఎలాగో పరీక్షల సమయంలో మాత్రం ఆట మానేవాడు. అదీ తమను దయ తలచినట్లుగా!

వాడు ఉన్నప్పుడు ఇల్లంతా ఎంత సందడి? అంజలి, వాడు కలిసి ఎన్ని ఆటలు ఆడుకొనే వారు. గాలి పటాలు ఎగర వేయడం, గోళీలు ఆడటం, బొంగరాల ఆట, అబ్బో... ఒకటేమిటి ఎవరు ఏ ఆటలు ఆడితే అందులో దూరిపోయే వాడు.

పనిమనిషి కొడుకు బిళ్ళ, కర్ర ఆడితే తను కూడా వాడితో సమంగా ఆట.

''ఔనురా! వాడి వయసు ఏమిటి? నీ వయసు ఏమిటి?'' అంటే నవ్వు.

''వయసులు వేరయినా ఆట ఒకటే కదండీ!'' అనేవాడు. ఆయన పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి.

అంజలి పళ్ళెం నిండా మొగ్గలు, మరువం కలిపి కోసుకుని వచ్చింది. తండ్రి ప్రక్కన వచ్చి కూర్చుని అడిగింది.

''ఏమిటి నాన్నగారూ! మీలో మీరే నవ్వుకొంటున్నారు''. ఆయన సమాధాన మివ్వలేదు. అఖిల్, నిఖిల్ ఆటలో వాదన చేసుకొంటూంటే అంజలి ఆట చూసి ''దెబ్బలాట లేకుండా ఆడుకోండి'' అని హెచ్చరించింది. అప్పటికి ఆమెకి గుర్తు



వచ్చింది.

''తమ్ముడు గుర్తు వచ్చాడా నాన్నగారూ?'' మృదువుగా అడిగింది.

ఆయన మౌనంగా తలూపారు.

''వాడిని చూసి రెండేళ్ళు ఔతోంది కదమ్మా?'' అన్నారు.

అంజలి మాట్లాడలేదు. ఆయనకి సంవత్సరాలు, నెలలు, రోజులు అన్నీ లెక్కే!

ఎప్పుడైనా తను నెల అవగానే రాకపోతే ఆయన ''అమ్మా! నువ్వు నచ్చి నెలా పది రోజులు అయిందమ్మా!'' అంటారు. తను వెంటనే ప్రయాణమై వస్తుంది.

విజయవాడలో భర్తకి ఉద్యోగం. తండ్రి రిటైరై ఇక్కడే ఉంటున్నారు. హైదరాబాద్ వాతావరణం వాళ్ళకి అలవాటయింది. అందుకే ఇక్కడ స్థిర నివాసం.

అనసూయ బజ్జీలు, ప్లేట్లు పట్టుకుని అక్కడికి వచ్చింది. పనిమనిషి మంచినీళ్ళు అందించింది.

అమ్మమ్మను చూడగానే మనవలు పరుగున వచ్చారు. ఆవిడ నవ్వి బజ్జీలు ప్లేటులో పెట్టి ముందు వారికి అందించింది.

''అమ్మమ్మా! బంగాళాదుంపల బజ్జీలంటే మాకూ చాలాఇష్టం'' బజ్జీలు తింటూ మనవలు చెప్పారు.

ఆవిడ మిగిలిన వారికి కూడా అందించింది. అప్పుడు గుర్తుకి వచ్చింది కాబోలు గబగబా ఇంట్లోకి వెళ్ళి పూతరేకుల డబ్బా పట్టుకుని వచ్చింది.

మధ్యాహ్నమే మనవలకు ఇష్టమని పూత రేకులు చుట్టింది.

ఆవిడ భర్త ప్లేటులో పూత రేకు పెడ్తూ అంది.

''అమ్మలూ! తమ్ముడికి ఇవంటే చాలా ఇష్టం కదూ?''

''మాకూ ఇవంటే చాలా ఇష్టం అమ్మమ్మా! మా మంచి అమ్మమ్మ'' మనవలు తింటూ, ఆ మూతితోనే రెండు వైపులా ముద్దులు ఇచ్చారు.

''మా మంచి అమ్మ. అన్నీ నాకు ఇష్టమైనవే చేసి పెడుతుంది'' అంటూ కొడుకు ఇలాగే తింటున్న మూతితో ముద్దు పెట్టేవాడు.

''వెధవా! ఎంగిలినోరు నువ్వూను. తినేసి, మూతి కడుక్కొన్నాక పెట్టవచ్చు కదురా!'' వాడిని దెబ్బలాడుతూ తను బుగ్గలు కడుక్కొనేది.

''మూడ్ పోతుందని పెట్టానమ్మా!'' అంటూ నవ్వేవాడు. అన్నీ జ్ఞాపకాల తోరణాలు. వాటిలోనే బ్రతకాలి కదా!

అంజలికి అమ్మ మనసు తెలుసును, నాన్నగారి ఆలోచనలూ తెలుసును.

వాళ్ళని వేరే కబుర్లలో పెట్టి, వాటిని తినేలాగ చూసింది. కట్టిన దండల్లో ఒకటి తీసి, తల్లి సిగచుట్టూ పెట్టింది.

పొడుం రంగు జరీ చీర, తెలుపు రంగు జాకట్టు, నుదిటిన నయాపైసంత కుంకుమ బొట్టు, కళ్ళకు కాటుక పసుపురాసిన పాదాలు, రెండు చేతుల నిండా బంగారం గాజులు, వాటి మధ్యలో ఎరుపు గాజులు, తెల్లటి అందమైన దేహఛాయతో తల్లిరూపం అంజలికి కనువిందు చేసింది. మా అమ్మ పార్వతీదేవి అని మనసులో అనుకుంది.


ముగ్గురూ కబుర్లలో మునిగి పోయారు. పిల్లలు మళ్ళీ ఆటలో నిమగ్నమై పోయారు.

హైదరాబాద్‌లో బాబాయి, మేనత్త ఉన్నారు. అమ్మ వైపు పినతల్లి ఉంది. అయినా ఒకరు మెహిదీ పట్నం అయితే ఒకరు కూకట్‌పల్లి, మరొకరు వనస్థలీ పురం. ఎవరి ఇల్లు దగ్గరా దాపులేదు. ఒక ఊరు వెళ్ళి వచ్చినట్లే. ఎప్పుడో శుభకార్యాలకు, ఆపదలకు కలుస్తారు. అలాగ ఈ చివర అమ్మ నాన్నగారు సైనిక్‌పురిలో ఉన్నారు.

ఒంటరితనం, వార్ధక్యం వాళ్ళను బాధిస్తున్నాయి. ఈ కాలంలో పిల్లలకి సంపాదన మోజు, విదేశ నివాసం మామూలై పోయాయి. తల్లిదండ్రులకి ముసలితనం పాపం లాగ, శాపం లాగ తప్పడం లేదు.

అంజలి టైము చూసింది. ఎనిమిది గంటలైంది. ఔను. కాలిఫోర్నియాలో నున్న తమ్ముడికి ఏడున్నర గంటలు ఉదయం అవుతుంది. ఫర్వాలేదు. నిద్ర లేస్తాడు.

అంజలి నెట్ దగ్గరకు వచ్చింది. తమ్ముడు లైనులోకి వచ్చాడు. వెబ్‌కామ్‌లో ఒకరినొకరు చూసుకున్నారు.




అవినాష్‌ను 'చంటి' అని పిలవడం అలవాటు. ''చంటి! కాఫీ తాగావా?'' అడిగింది.

''ఊ... మీరు ఏం చేస్తున్నారు?'' అడిగాడు.

తల్లి, తండ్రి, పిల్లలు నెట్ దగ్గరకు వచ్చారు. అమ్మ తమ్ముడిని ఎప్పుడు నెట్‌లో చూసినా కళ్ళ నీళ్ళు పెట్టుకుంటుంది. ఇప్పుడూ అంతే!

''మావయ్యా! అమ్మమ్మ మా కోసం బంగాళాదుంపలతో బజ్జీలు వేసింది. పూతరేకులు కూడా చేసి పెట్టింది''.

నిఖిల్ అందుకున్నాడు. ''నిన్ను తలుచుకుంది. ఏడ్చింది'' అవినాష్ రెండు నిముషాలు మౌనం వహించాడు.

తర్వాత అడిగాడు, ''ఔనురా! మా అమ్మ చేత ఎందుకు చేయించుకున్నారు? మీ అమ్మ ఉంది కదా! మీరు పని చేయించారని మా అమ్మ ఏడ్చింది''.

అంజలి పిల్లలను టి.వి. చూడమని పంపింది. వాళ్ళు అక్కడ నుండి పిలవడంతో రామారావు అనసూయ వెళ్ళిపోయారు. అంజలి తలుపు చేరవేసి వచ్చి కూర్చుంది.

''చంటీ! అమ్మ, నాన్నగారు ఒంటరిగా ఉండలేక పోతున్నారు. నువ్వు ఈ ఏడాది కూడా రాలేదు. వాళ్ళు ఎదురు చూస్తున్నారని కూడా నీకు లేదురా?'' అంది.

''ఇక్కడ బిజీగా ఉన్నానే! అక్కడకు వస్తే ప్రాక్టీసు లాస్ అవుతాను. అపర్ణకి సెలవు దొరకడం లేదు. తనను పంపడానికి అవడం లేదు'' అన్నాడు.

''నాన్నగారు ఫ్లైట్ ఎక్కడానికి వీలులేదు. అమ్మ ఆయనను వదిలి రాలేదు. నిన్ను చూడ లేదని ఎంతగానో అనుకొంటున్నారు. చంటీ! అక్కడి ఇల్లు ఎవరికైనా అమ్మెయ్యి. ఇక్కడకు వచ్చి సెటిలైపోతే బావుంటుంది. నీలాంటి డాక్టర్ ఇక్కడ ఉంటే మన దేశానికి కూడా గర్వకారణం కదురా!'' అంది.

అంజలి గొంతు రుద్ధమైంది.

''వాళ్ళిద్దరూ ఎప్పుడూ నిన్ను తలుచుకొంటారురా! పండుటాకులు ఎప్పుడు రాలి పోతాయో! నాన్నగారికి ఎనభై రెండేళ్ళురా! అమ్మకి అరవై ఐదు. వాళ్ళకి ఇప్పుడు నీ ఆసరా కావాలి కదురా! వాళ్ళని ఇలాగ చూడటానికి చాలా బాధగా ఉందిరా!'' అంది.

ఇంక మాట్లాడటానికి కంఠం సహకరించలేదు. కన్నీళ్ళు వద్దనుకొన్నా ఉబికి వస్తున్నాయి. మెసేజ్ పంపడం మొదలు పెట్టింది.

మనల్ని పెంచడానికి వాళ్ళు ఎంత కష్టపడ్డారో మనకు తెలియనిది కాదు. నాన్నగారి చిటికెన వేలు పట్టుకుని మనం స్కూలుకి వెళ్ళడం నాకు ఇంకా గుర్తు ఉందిరా!

నన్ను, నిన్ను చెరొక చేత్తో పట్టుకుని బడిలో దింపే వారు. నువ్వు చదువుకి వచ్చాక. మన తరగతి పుస్తకాలకి అట్టలు అందంగా తను వేసే వారు. వాటిపై మన పేర్లు, తరగతి, సెక్షన్, స్కూల్‌పేరు అన్నీ చక్కగా, అందంగా వ్రాసేవారు.

అమ్మ ఒకరికి, నాన్న ఒకరికి దగ్గర కూర్చోపెట్టుకుని అన్నం తినిపించే వారు. వాళ్ళు కలిపి పెట్టిన అన్నం, కూర ఎంత రుచిగా ఉండేవి? మనకు ఇష్టమని ఆవకాయ కలిపి, అందులో వెన్న, పెరుగు, మీగడ మనం ఏది కావాలంటే అది అద్ది పెట్టేవారు.

చంటీ! గుర్తుందా! నీకు టైఫాయిడ్ జ్వరం వస్తే నువ్వు బార్లీ తాగనని పేచీ పెడితే, నాన్నగారు కూడా నీకు తగ్గే వరకూ బార్లీ తాగారు. క్రొత్తగా సైకిలు కొన మని నువ్వు పేచీ పెడితే కొని, దాన్ని నువ్వు తొక్కు తూంటే, ఆయన వెనక పట్టుకుని తిరిగేవారు.

మనం పబ్లిక్ పరీక్షలు వ్రాస్తే, రిజల్టు వస్తాయని తెలిసిన నాడు ముందే బయటకు వెళ్ళి పేపర్కొని తెచ్చి, మన విజయాన్ని సంబరంగా చెప్పేవారు.

మన అమ్మ ఆణిముత్యం కదురా! ఏదైనా తినా లని ఉందని ఒకసారి అనేసరికి, వెంటనే సిద్ధం చేసి, మన కడుపులు నింపేది కదురా!

పరీక్షలకు చదువుకొంటూ, ఎక్కడ నిద్రలోకి జారి పోతామో అని ఇద్దరూ కళ్ళల్లో వత్తులు వేసికొని కూర్చునే వారు కదురా!

మనం సుఖపడాలని వాళ్ళు సుఖాలు త్యాగం చేశారు కదురా! మనకి కావలసినవి అందించడం కోసం. వాళ్ళ అవసరాలు కుదించుకొన్నారు కదురా!

మొన్న నాన్నగారు ఏమన్నారో తెలుసా? ''మా అమ్మ ఎప్పుడూ నూరేళ్ళు చల్లగా బ్రతకరా!'' అని దీవించేది. అలాంటి దీవన పనికి రాదేమో? ఎప్పుడు... ఎంత త్వరగా ఈ జీవితం అంతమవు తుందా అన్పిస్తోంది తల్లీ!'' అని బాధగా అన్నారు.

ఆ మాటలలో ఎంత ఆవేదన? ఎంత నిస్పృహ యత? నాకు ఏడుపు వచ్చిందిరా!

నా వెనుక అత్తవారి కుటుంబం పెద్దది లేకపోయి ఉంటే బావుండేది. లేదూ నేనూ మగపిల్లవాడినై పుట్టినా బావుండేది.

అందరిలో చులకన అని మన నాన్నగారు ఆడ పిల్లనని మా ఇంటికి వచ్చి ఉండటం లేదురా!

చంటీ! స్మృతుల పొరలు విప్పాను. నీ మనసును మన బాల్యంలోకి తీసికెళ్ళాను. ఇప్పటికైనా నీ కర్తవ్యం ఆలోచించుకోరా!''

అంజలి కళ్ళు తుడుచుకుంటూ, కుర్చీ వెనక్కి వాలిపోయింది.

రెండు నిముషాలు గడిచాయో, లేదో అపర్ణ వెబ్లో కనబడింది. వెంటనే కంచు కంఠంతో మాట్లా డటం మొదలు పెట్టింది.

అంజలికి వినక తప్పలేదు.

''మేము సుఖంగా ఉండటం మీకు ఇష్టం లేదా? నాలుగు రాళ్ళు సంపాదించుకోవడం ఇష్టం లేదా? మా పిల్లలు అభివృద్ధి చెందడం ఇష్టం లేదా? ఆయ నను చూడండి. మీ నుండి ఫోను వస్తే ఏడుస్తారు. నెట్లో క్లాసు పీకారు. ఇంక ఆయన ఈ రోజు అవుట్. ఇప్పటికే ఇండియా పోదామని షంటింగ్ పడలేక పోతున్నాను.

ఎనభై ఏళ్ళ వాళ్ళకోసం మేము మా ఫ్యూచర్ పాడు చేసుకోవాలి. అంతేకదూ! ముసలి వాళ్ళు ఎలాగో అలాగ కాలం గడుపుకోవచ్చును కదా! నెట్లో చూస్తు న్నారు. మాట్లాడు తున్నారు. అయినా వచ్చెయ్య మంటూ గొడవ. మీకు ఒక విషయం చెపుతున్నాను.''

అంజలి వెంటనే అందుకుంది.

''చూడు అపర్ణా! నీకు చూడాలన్పించినా, మీ వాళ్ళకు నిన్ను చూడాలన్పించినా ఫ్లైట్ టిక్కట్లు పంపి మీ వాళ్ళను పిలిపించుకొంటున్నావు. మా వాళ్ళంత వృద్ధులు మీ వాళ్ళు కారు. అయినా నీలాంటి అమ్మా యిని కనడమే వాళ్ళు చేసుకున్న అదృష్టమేమో?''

''షటప్... మీకు ఇప్పుడే చెపుతున్నాను. సరదాగా మాట్లాడితే వచ్చి మాట్లాడండి. బాధలు ఏకరువు పెట్టడానికి అయితే రావద్దు. చేతనైతే మీ తల్లిదండ్రు లకు మీరు ఏదైనా చేయండి. ఎదుటి వాళ్ళమీద ఈర్ష్య పడవద్దు. చేతకాని వాళ్ళకి శౌర్యం ఎక్కువట. ఎదుటి వాళ్ళకి చెప్పడానికే నీతులు'' అంటూ ఆఫ్ చేసింది.

అంజలికి అపర్ణ ఇంతలాగ బిహేవ్ చేయగలదని తెలియదు. పైకి తేనె పూసిన కత్తిలాగ మాట్లాడితే భ్రమ పడింది.

ఎక్కడో అనుమానం. అవినాష్ అక్కడ ఉండిపోవ డానికి తనే కారణమేమోనని. అయినా తమ్ముడికి డబ్బు యావేమో అని భ్రమ పడింది.

ప్రతి మగవాడి విజయం వెనుక ఒక స్త్రీ మూర్తి ఉంటుందంటారు. మరి ప్రతి మగవాడి బాధ్యతారా హిత్యం వెనుక, స్వార్థబుద్ధి వెనుక కూడా స్త్రీ మూర్తి ఉంటుంది అని ఇప్పుడు అర్థమవుతోంది.

తల్లి అప్పుడప్పుడూ చెప్పే మాటలు గుర్తు వచ్చాయి. తమ్ముడు మాట్లాడుతూ ఉంటే, ''మీకు టైమవుతోంది, మీరు వెళ్ళండి అనో మీ టిఫిన్ చల్లారి పోతుంది, రండి'' అనో పిలుస్తుందిట. తను కూర్చుని నాలుగు మాటలు మాట్లాడి ముగిస్తుంది. ''కొడుకో, కోడలో... ఎవరో ఒకరు మాట్లాడుతున్నారని మేము సంబరపడుతున్నాం'' అంటూ తల్లి వేదనను అణిచి పెట్టి అనడం గుర్తు వచ్చింది.

స్త్రీకి స్త్రీయే శత్రువు. తన తల్లి బాధ, తండ్రి బాధ అర్థం చేసుకోక పోవడం ఒక తప్పయితే, తమ్ముడిని గుప్పెటలో పెట్టుకోవడం మరొక తప్పు.

అంజలి మనసులో విసుక్కొంది. అయినా ఆ పిల్లను అనడం ఎందుకు? వీడి మెతక తనాన్ని అనాలి. ప్రతి మనిషి జీవితంలో అందరూ ఉంటారు. ఎవరికి ఇవ్వవలసిన ప్రాధాన్యత వారికి ఇవ్వాలి.

అంజలికి తలనొప్పిగా అన్పించింది. బాధగా కణ తలు నొక్కుకుంది.

భోజనాల దగ్గర కూతురు ముభావంగా ఉంటే తల్లిదండ్రులు తల్లడిల్లి పోయారు.

అన్నం సరిగ్గా తినలేదని తల్లి వేడిపాలు తెచ్చి ఇచ్చింది. తండ్రి జెండూబామ్ తెచ్చి రాశారు. అంజ లికి వారి ప్రేమకి కళ్ళనీళ్ళు తిరిగాయి.

ఈ ప్రేమకు ఎవరైనా ఖరీదు కట్టగలరా? అసలు తల్లిదండ్రుల ప్రేమకి ఖరీదు కట్టే అంశమే ప్రపం చంలో లేదు.

''మమ్మీ! డాడీ ఫోను చేస్తున్నారు'' అంటూ అఖిల్ సెల్ తెచ్చి ఇచ్చాడు.

అవతలి నుండి శ్రీవారు ఫోనులో కబుర్లు. అంజలి లేని ఓపిక తెచ్చుకుని వింటోంది.

''ఏమిటీ? ఒంట్లో బావుండలేదా?'' ''ఊ'' ''ఊ'' అని ఊరుకొంటున్నావు. ఏం జరిగింది? చెప్పు అంజలీ'' అడిగాడు.

అంజలి పేలవంగా నవ్వింది.

''ఏం లేదండీ! కొద్దిగా తలనొప్పి. అంతే!'' అంది.

ఆనంద్ అందుకున్నాడు. ''మావయ్యగారు బాగు న్నారా? అత్తయ్యగారు ఆరోగ్యంగా తిరుగుతు న్నారా? అవసరమైతే నాలుగు రోజులుండిరా! అమ్మా వాళ్ళ విషయం పర్వాలేదు. వదినా వాళ్ళు చూస్తారు'' అన్నాడు.

అంజలి అతడి అమృత హృదయానికి జోహార్లు అర్పించింది. ఆనంద్కి సమిష్టి కుటుంబం అంటే ఇష్టం. అతడి అన్నదమ్ములకీ అంతే! అందుకే బావ గారు, తాము, మరిది కలిసి మామగారి దగ్గర ఉంటు న్నారు. ఆడపడుచు వచ్చి వెళుతూ ఉంటారు. వాళ్ళ పాప తమ దగ్గరే ఉండి చదువుకొంటోంది.

ఆనంద్ తప్పులేదు. అతడు అత్తగారిని, మావగా రిని వచ్చి తమ దగ్గర ఉండమంటారు. నాన్నగారు నవ్వి ఊరుకొంటారు.

ఆయన మరీ బలవంతం చేస్తే వచ్చి, నాలుగు రోజులు ఉండి, వెంటనే వచ్చేస్తారు.

''ఉండండి మావయ్య గారూ!'' అంటే, ''నాయనా! ఎవరి చివరి మజిలీ ఎవరి చేతుల మీద అవుతుందో? మేము నీ చేతిమీద వెళ్ళాలని భగవం తుడు రాసినప్పుడు తప్పదు. అంతవరకూ ఉండ నీయి'' అంటారు.

ఆనంద్ ఎప్పుడూ అంటారు ''ఆయనంత అభి మాన ధనులను చూడలేదు'' అని.

అభిమానమే నాన్నగారి ఆభరణం. అంజలి ఈ లోకం లోకి వచ్చి గడియ వైపు చూసింది. పది గంటలు అయింది.



## కలిసొచ్చిన రెడ్ కలర్....

ఒక్కొక్కరికీ ఒక్కో సెంటిమెంట్ ఉంటుంది. అలాగే హీరోయిన్ కమలిని ముఖర్జీ విషయంలో కూడా దర్శక నిర్మాతలకు ఓ సెంటిమెంట్ ఉందట! అదేనండీ కలర్ సెంటిమెంట్. అసలే అందగత్తె అయిన కమలినీకి ఎర్ర చీర కడితే మరింత అందంగా ఉంటుందన్నది వారి గట్టి నమ్మకం. ఈ విషయం గతంలో చాలా సార్లు రుజువు అయింది కూడా. దాంతో కమలినీ తాజా చిత్రం(రాజశేఖర్ హీరో)లో కూడా ఆమె చేత ఎర్రచీర కట్టించారు. దాంతో సినిమా పూర్తి కాకుండానే, తమ సినిమా సూపర్ డూపర్ హిట్ అవుతుందని ఆ దర్శక నిర్మాతలకి బోలెడంత నమ్మకం వచ్చేసిందట! ఇంకేం....గత కొంత కాలంగా సరైన సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న రాజశేఖర్ పంట పండినట్టేనని టాలీవుడ్ విమ ర్శకులు అంటున్నారు.

అంజలి లేచి తల్లిదండ్రుల గది దగ్గరికి వచ్చింది. రెండు సింగిల్ కాట్‌ల మీద తల్లి తండ్రి వారి మధ్యలో అఖిల్, నిఖిల్ పడుకుని నిద్రపోతున్నారు.

అఖిల్ తాతగారి చుట్టూ చేతులు వేసి పడుకుంటూ నిఖిల్ అమ్మమ్మ గుండెల దగ్గర ఒదిగి పోయి పడుకున్నాడు.

వారికి నిద్రాభంగమవకుండా అంజలి బయలుదేరి వచ్చేసింది.

కళ్ళు మూసుకున్న అదే దృశ్యం. తల్లి, తండ్రి వారి మధ్యలో పడుకున్నా పిల్లలు గుర్తు వస్తున్నారు.

రాత్రిళ్ళు సరిగ్గా నిద్రపోరని తండ్రి గురించి తల్లి చెపుతుంది. అలాంటిది నిశ్చింతగా నిద్రపోతున్నారు.

అఖిల్ నిఖిల్ వచ్చి మీద పడి లేపుతూంటే అంజలికి మెలకువ వచ్చింది.

"ఏమిటి మమ్మీ! ఎనిమిది గంటలవుతున్నా లేవలేదు. మేము చూడు. నిద్రలేచి అప్పుడే బ్రష్ చేసి, బూస్ట్ తాగి, స్నానాలు కూడా చేసేశాం" అన్నాడు.

"ఊ.... రాత్రి చాలాసేపు నిద్ర పట్టలేదమ్మా! అయినా మీరు నాకంటె ఎలా ఫస్టు అయ్యారు?" ఆశ్చర్యం అభినయించింది.

"మరి ... తాతగారు ఎప్పుడూ చెపుతారు కదా పెందరాళే పడుకోవాలిట. పెందరాళే నిద్ర లేవాలిట. తాతగారి దగ్గర ఉన్నాం కనుక తాతగారి అలవాట్లు పాటిస్తున్నాం" అఖిల్ చెప్పాడు.

అంజలి వారిద్దరినీ ముద్దు పెట్టుకుంది. ఇద్దరూ కవల పిల్లలు. ఏడవ తరగతికి వచ్చారు.

రామారావు గారు కూరల మార్కెట్‌కి బయలుదేరుతూంటే అంజలి వారించింది.

"మీరు ఉండండి నాన్నగారూ! నేను వెళ్ళి కొనుక్కుని వస్తాను" అంది.

అంజలితో అఖిల్ "నేనూ వస్తానమ్మా" అన్నాడు.

"నేను కూడా డిటో" అన్నాడు నిఖిల్.

ముగ్గురు బయలుదేరారు. అంజలి కూరలు ఎలా ఎంపిక చేయాలో పిల్లలకు చెప్పింది.

భోజనాల దగ్గర అఖిల్ మారాం చేశాడు.

"తాతగారూ! మీరు నాకు పెట్టాలి"

"ఛా... ఇంత పెద్దవాడవయ్యావు. తాతగారు ఎందుకురా పెట్టడం?" నిఖిల్ కోపంగా అడిగాడు.

"అది అంతే! తాతగారు పెట్టారు కనుక మావయ్య పెద్దవాడయ్యాడు. పెద్ద చదువులు చదివాడు. విదేశాలు వెళ్ళాడు. నేను స్టేట్స్ వెళ్ళను కానీ బాగా గొప్పవాడినవ్వాలి" అన్నాడు.

రామారావు గారు వాడి తల ముద్దుపెట్టుకున్నారు. ఆప్యాయంగా అన్నం కలిపి పెట్టారు.

నిఖిల్ అనసూయకి కంప్లైంట్ చేశాడు.

"చూశావా అమ్మమ్మా! మీ వారు వాడికి ప్రేమగా ఎలా కలిపి పెడుతున్నారో? మరి నువ్వు నాకు పెట్టవచ్చును కదా!"

అనసూయ ముసిముసిగా నవ్వింది.

"వాడిమీద నీకు పోటీ ఎందుకురా? నువ్వు కావాలంటే తాతగారు పెట్టరా?" అడిగింది.

"కుదరదు అమ్మమ్మా! ఆయన వాడికి ఫస్టు ప్రిఫరెన్స్ ఇచ్చారు. నేను నీతో సర్దుకోవలసిందే!" నిఖిల్ పట్టుదలగా అన్నాడు.

"భడవా! సర్దుకోవడం ఏమిట్రా? నేను మీ తాతగారి కన్నా బాగు కలిపి పెడతాను తెలుసా?" అడిగింది నవ్వుతూ.

"ముందు పెట్టు అమ్మమ్మా! వాడు అప్పుడే రెండు ముద్దలు మింగేశాడు" పోటీగా నిఖిల్ గొడవ.

వాళ్ళిద్దరూ ఇద్దరి దగ్గరా తింటూంటే అంజలి కళ్ళు మెరిశాయి. కబుర్లతో, నవ్వులతో పెద్దవాళ్ళు కూడా రెండు ముద్దలు ఎక్కువే తిన్నారు.

అనసూయ దిగులుగా అంది "మీ మురిపాలు మరో నాలుగురోజులు. తర్వాత మీ తాతగారు, నేను ఊడగొట్టిన మంచం కోళ్ళు లాగ పడి ఉండాలి".

అంజలి అఖిల్ తాతగారిని "మగధీర" సినిమాకి తీసికెళ్ళమని అడగడం వింటోంది.

నిఖిల్ కూడా "తాతగారూ" "ఐ మాక్స్"లో ఆ సినిమా చాలా బావుంటుంది. పదండి. వెళదాం" అంటూ ఆయన భుజాలు మీద వాలిపోయి అడిగాడు.

సాయంత్రం అందరూ సినిమాకి వెళ్ళారు. పిల్లలు, తల్లిదండ్రులు ఉత్సాహంగా ఉండటం, కబుర్లు చెప్పుకోవడం అంజలికి తృప్తినిచ్చింది.

రెండురోజుల తర్వాత అంజలి తల్లితో అంది "అమ్మా! మాది ఉమ్మడి కుటుంబం కదా! పని చాలా ఎక్కువగా ఉంటోంది. నేను మ్యూజిక్ ఇంప్రూవ్ చేసుకోవడానికి కూడా అవడం లేదు. ఇంక ఈ ఇద్దరు వెధవలూ ప్రతి దానికీ పందెం వేస్తారు. అల్లరి చేస్తారు. పోటీ పడతారు. అబ్బబ్బ... పడలేక పోతున్నాను. నువ్వు ఒకరిని నీ దగ్గర ఉంచుకో అమ్మా! నా ప్రాణం సుఖపడుతుంది" అంది.

అనసూయ తెల్లబోయింది. ఏనాడూ చిన్నప్పుడు కూడా అంజలి పిల్లలను వదలలేదు. కవల పిల్లలైనా కష్టపడి పెంచుకుంది. ఇక్కడికి వచ్చినప్పుడు, తను వెళ్ళినప్పుడు దానికి విశ్రాంతి ఉంటుంది అయినా ఏనాడూ అలసట అని అనలేదు. ఇప్పుడు....

అఖిల్ తల్లిఒడిలో పడుకున్నాడు. తల్లి చేతిని పట్టుకుని అన్నాడు. "అమ్మా! అమ్మమ్మకి నన్ను ఇచ్చెయ్యి. తాతగారికి నేనంటే బాగా ఇష్టం." నిఖిల్ తారాజువ్వలాగ వచ్చారు. బహుశా వాడు విన్నాడేమో?

"మమ్మీ! అమ్మమ్మకి నన్ను ఇచ్చెయ్యి. మాకూ ఇష్టమైనవి ఎప్పుడూ వండి పెడుతుంది కదా! హాయిగా ఉంటాను" అన్నాడు.

అఖిల్ అన్నాడు. "ఒరేయ్! నేను నీకంటే కొద్ది నిమిషాలు ముందు పుట్టాను కదా! ఈ విషయంలో పోటీ వద్దు. నేను ఉంటాను. నువ్వు అమ్మ దగ్గర ఉండు".

అంజలి కొడుకులను ముద్దుపెట్టుకుంది. ఎంత అదృష్టం! భగవంతుడు పనస చెక్కల్లాగ ఇద్దరు మగ బిడ్డలను ఇచ్చాడు. తన లక్ష్య సాధనకే అలాగ ఇచ్చాడేమో?

రాత్రి అంజలి దగ్గర అఖిల్ పడుకున్నాడు. అంజలి కొడుకు తల నిమురుతోంది. వాడు కళ్ళు ఎత్తి, తల్లిని చూస్తూ అన్నాడు.

"అమ్మా! నువ్వు మావయ్యకి పంపిన మెసేజ్ మేము చదివాం. నువ్వు అమ్మమ్మ గురించి, తాతగారి గురించి ఎంతో బెంగ పడుతున్నావని మాకు అర్థమైంది. మేము ఇద్దరం ఉన్నాం కదా! ఒకరు ఇక్కడ, మరొకరు నీ దగ్గర ఉంటాం! తాతగారి దగ్గర ఉండి సాయం చేయడం మాకు ఇష్టమే!"

ఎప్పుడు వచ్చాడో నిఖిల్ వీపు మీద వాలి అన్నాడు. "ఔను అమ్మా! నాకూ ఇష్టమే! కానీ అన్న ఉంటాడుట. వాడి మాట నేను వినాలిట."

మర్నాడు అంజలి వెళ్ళిపోతూ తండ్రితో చెప్పింది.

"అఖిల్ మీ దగ్గర ఉండి చదువుకొంటాడుట. మీ అల్లుడు కూడా సరే అన్నారు. నేను వెళ్ళి వాడి టిసి పంపిస్తాను. మంచి స్కూల్లో జాయిన్ చేయండి"

అఖిల్ తాతగారి చేయి ఎత్తిపట్టుకుని తల్లికి, తమ్ముడికి వీడ్కోలు చెప్పాడు.

రామారావు అనసూయతో అశ్రునయనాలతో అన్నాడు. "తల్లికి ఎందరు బిడ్డలున్నా భారం కాదు. తీగకు కాయ భారమవుతుందా? కానే కాదు. ఈ 'చిరుదీపాన్ని' అంజలి మనకోసం వదిలింది. మన జీవితాలకు వెలుగు పంచడం కోసం వదిలింది".

ఆయన మాటలతో ఏకీభవిస్తూ అనసూయ, అఖిల్ భుజాల చుట్టూ ఆప్యాయంగా చేతిని వేసి ఇంట్లోకి నడిపించింది.

*

రచయిత సెల్ నెం: 98660 58449

## గాలి

కవిత

నువ్వు అలా వెళ్ళిపోతుంటే
నా శరీరాన్ని సరసంగా స్పృశించినట్టు
నా అంతిమ క్షణాల వరకూ అంటిపెట్టుకుని వుంటానన్నట్టు..
అణువణువునా నువ్వు కనిపించావు
నువ్వున్నావన్న ధైర్యాన్ని నాలో కలిగించావు.
అన్ని కాలాలు..
అన్ని ఋతువులు..
ఎల్లవేళలా
నువ్వు నా తోడు అన్ని విషయాల్లో.
బీచ్‌లో నా ప్రక్కన
దగ్గరగా..



సూర్యుడు సిగ్గుతో చల్లగా జారుకుంటున్న వేళ
నువ్వు నా చెవిలో చేసిన గుసగుసలు
పెదవులతో కురిపించిన తీయని ముద్దులు
నాకు ధైర్యాన్నిచ్చాయి.
నువ్వు నన్ను వదిలి వెళ్ళవని.. వెళ్ళలేవని
నీ కళ్లలో నిజాయితీ
నా కళ్ళతో ఒట్టేసి చెప్పింది
ఈ గాలికి తెలుసు
మనం ఒకరినొకరికై పొందిన పారవశ్యం
అందుకే
జీవితాంతం
అది మనల్ని కలిపే ఉంచుతుంది.

–మంత్రవాది మహేశ్వర్